క్లుప్తంగా

మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం



మాండవ్య నారాయణస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సామర్లకోట: పట్టణంలోని అతిపూరాతన విష్ణు ఆలయమైన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. దీనికి తోడు స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య ఔపాసన, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి దీపారాధన, శ్రీపుష్పయాగోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణ మూర్తి తెలిపారు.

నూకాలమ్మతల్లికి కుంభాభిషేకం



నూకాలమ్మ తల్లి అభిషేకానికి బిందెలతో నీటిని తీసుకువస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొలువైన నూకాలమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని సుమారు 250 మంది మహిళలు ఆలయం నుంచి బిందెలతో గోదావరికి చేరుకుని నీటిని తీసుకువచ్చి కుంభాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో సామూహిక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొమ్మలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి సత్యనారాయణ, పారాయణ కమిటీ నాయకురాలు సత్తి అరుణ భక్తులకు సేవలందించారు. ఆలయ అర్చకులు సాయి పూజలు చేశారు. నూకాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని నాణేలతో అలంకరించనున్నట్టు ధర్మకర్త బుల్లియ్య తెలిపారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



గీతాయజ్ఞం, హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మల్లికార్జున స్వామి

పెద్దాపురం: హనుజ్జయంత్యుత్సవంలో భాగంగా జి.రాగంపేటలో గురువారం సనాతన ధర్మ గీత ప్రచారకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గీతా జ్ఞానయజ్ఞం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ భక్తాశ్రమంలో 51వ వార్షికోత్సవంలో భాగంగా కుంచే చినబాబు దంపతులు స్వామికి తమలపాకుల పూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆశ్రమాధిపతి మాతా సేవా నందగిరి తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నారాయణరావు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కొత్తమూలపేటకు చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మచ్చా నారాయణరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందించిన రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ నడింపల్లి సుగుణ, నడిపల్లి నల్లబ్బాయి, మాత కుమార్, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన బాడితబోయిన వీర వెంకట రామకృష్ణ వైన్ షాపు వద్ద మద్యం బాటిల్స్ కొనుగోలు చేసి వాటిని గ్రామ శివారు చెరువు వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. దీనిపై తమకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్రోచ్ అయ్యేదెలా?

- వంతెన పూర్తయినా తప్పని సమస్యలు
- భారీ వాహనాల వెనుక ప్రయాణం ధూళిమయం
- గడ్డర్లు తొలగిస్తేనే ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం



వంతెన మీదుగా రాక పోకలు సాగిస్తున్న వాహనాలు

సామర్లకోట: దీర్ఘకాలిక సమస్యకు చెక్ పెడుతూ పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై వంతెన నిర్మించినప్పటికీ అప్రోచ్ నిర్మించకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం ఏలేరు కాలువపై ఉన్న ఇరుకు వంతెన కూలిపోయింది. రూ.1.5 కోట్లతో వంతెన, రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తి అయినప్పటికీ కొనరు పనులు నిర్లక్ష్యంగా వదిలేశారు. కాంట్రాక్టరుపై వత్తిడి తీసుకువచ్చి, పనులను పిఠాపురం ఆర్ అండ్‌బీ అధికారులు పర్యవేక్షించాల్సి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వంతెన పనులు పూర్తయ్యి మూడు నెలలైనా అప్రోచ్ నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నారు. భారీ వాహనాలు ఈ వంతెన మీదుగా రాకపోకలున సాగిస్తున్నప్పుడు ఎర్రమట్టి లేచిపోయి వెనుక వస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు తీవ్ర అవస్థలు కలిగిస్తోంది.

పిఠాపురానికి నిలచిన బస్సులు..

సామర్లకోట నుంచి పిఠాపురానికి సుమారు మూడేళ్లగా బస్సుల రాకపోకలు నిలిచి పోయాయి. వంతెన కూలిపోవడంతో ఆర్టీసీ అధికారులు పిఠాపురానికి బస్సులు నిలిపివేశారు. నేడు వంతెన పూర్తయినా రోడ్డుకు అడ్డంగా ఉన్న గడ్డర్లు తొలగించకపోవడంతో బస్సులను పునఃప్రారంభించలేదు. దీంతో ప్రయాణికులకు ఆటోలే శరణ్యమయ్యాయి. ఇదే అదనుగా తమ జేబులు చిల్లులు పొడుస్తున్నారని ప్రయాణికులు ఆటో డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా వివిధ కార్పొరేట్ కళాశాలల బస్సులు, టిప్పర్ గడ్డర్ సమీపంలో ఉన్న రోడ్డు మార్జిన్ మీదుగా ప్రమాదకరంగా రాక పోకలు సాగిస్తున్నాయి.

వంతెనకు అప్రోచ్ రోడ్డు వేయండి



ఏలేరు కాలువపై వంతెన నిర్మించినా అప్రోచ్ గ్రావెల్ వేసి వదిలేశారు. దాంతో చిన్న వాహనాల వారు ఇబ్బంది పడుతున్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇదే మార్గం కావడంతో కాంట్రాక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– ఇరుసుమళ్ల సాయి, గృహసారథుల పట్టణ కన్వీనర్, సామర్లకోట

కాంట్రాక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కరిస్తాం



అప్రోచ్ పూర్తి చేయకపోవడానికి కారణాలను కాంట్రాక్టరును అడిగి తెలుసుకుంటాం. రహదారి పనులకు సీఎం జగన్ నిధులు ఇస్తున్నారు. అప్రోచ్‌తో పాటు పిఠాపురం రోడ్డు పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, సామర్లకోట

పరీక్ష కేంద్రం పరిశీలన



ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ జైన్

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ గురువారం మండల పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. దీనిలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్‌నూ పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, ఆరోగ్య సిబ్బంది ఏర్పాట్లపై సమాచారం సేకరించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై విశ్వాసం పెంచాలి



జి.మేడపాడులో గృహసారథులకు ప్రచారకిట్లు అందజేసిన మోరంపూడి శ్రీరంగనాయకులు

సామర్లకోట: సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గ్రామ గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారిలో సీఎం జగన్‌పై విశ్వాసం పెంచేలా పని చేయాలని పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు అన్నారు. గురువారం సాయంత్రం జి.మేడపాడు పంచాయతీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అందులో భాగంగా ప్రచార మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పటాని దేవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, తూర్పు కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు పటాని వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ, పార్టీ నాయకుడు పుట్టా బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భరోసా 'ఆసరా'



వైఎస్సార్ అసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ గీత, హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీ గీత, 'హౌసింగ్' చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు మరింత ఆర్థిక భరోసా తీసుకువచ్చిందని ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో భాగంగా గురువారం మండలంలోని కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను వారు పంపిణీ చేశారు. సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ గీత, హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీని మాటకు కట్టుబడ్డి పాలిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళ ఆర్థిక భరోసాకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళా సాధికారతతో పాటు అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వమిది అన్నారు. భవిష్యత్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణ పడి ఉన్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ హిమమహేశ్వరి, ఏపీఎం సూర్యనారాయణ, ఎంపీటీసీ నల్లల సూర్య కుమారి, సొసైటీ అధ్యక్షులు చల్లా చిన వీర్రాజు, నల్లల గోవిందు, ఏలేటి అనంతలక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పి.దొంతమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం



పి దొంతమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పి.దొంతమూరులో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి పింఛను సక్రమంగా అందుతుందా ? లేదా ? అని ఆరా తీశారు. గతంలో పెన్షన్ తీసుకోవాలంటే ఎంతో టెన్షన్ పడాల్సి వచ్చేదని, ఇప్పుడు లబ్ధిదారుల ఇంటికే పింఛను తెచ్చి ఇస్తున్నారని తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి గత మూడేళ్లలో ప్రభుత్వం అందజేసిన పథకాల వివరాలను వారికి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా ఒకటో తేదీన ఇంటికి తెచ్చి పెన్షన్ ఇచ్చే పరిస్థితి దేశంలో మన రాష్ట్రంలోనే అమలవుతోందన్నారు. పథకాల అమలులో ఎటువంటి అవకతవకలకు తావు లేదన్నారు. ఎవరి ప్రమేయం సిఫార్సులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. దీనిని తట్టుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందని, ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి ఆరు పథకాల వరకూ అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, కొత్తపల్లి రమణబాబ్జి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్నే మా భవిష్యత్తు

- 13న జగనన్నకు చెప్పకుందాం
- రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ దవులూరి



జగనన్నే మా భవిషత్తు పోస్టర్లను ఆవిష్కరించిన దొరబాబు, తదితరులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి 'జగనన్నే మా భవిషత్తు' నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపు నిచ్చారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగనన్నా..' అనే నినాదంతో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వచ్చి వారి వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. సీఎం పనితీరుపై ఐదు ప్రశ్నలతో సర్వే చేస్తారని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుతం ప్రభుత్వానికి ఉన్న తేడాతో పాటు ప్రజల నుంచి మంచి సలహాలను స్వీకరించి వాటిని అమలు చేస్తారన్నారు. సీఎం సందేశాన్ని ప్రజలకు వివరించడానికి, ప్రజల ఫిర్యాదులను సీఎం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. ఈ మేరకు సీఎం జగన్ పరిపాలనకు సంబంధించి ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

13న జగనన్నకు చెప్పకుందాం...

అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు సాంకేతిక లోపాలతో అందక పోతే వాటికి సంబంధించి జగనన్నకు చెప్పుకుందాం అనే కార్యక్రమం ఈనెల 13వ తేదీన జరుగుతుందని చెప్పారు. పథకాలు అందని వారికి ఈ పథకం ద్వారా లబ్ధి జరుగుతుందని అన్నారు. ఈ మేరకు కార్యక్రమాల పోస్టర్లను దొరబాబు ఆవిష్కరించారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్ర దేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో ఫ్యామిలీ డాక్టర్ వాహనాలు ప్రారంభం



ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న దొరబాబు

పిఠాపురం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచే ఒక కొత్త సువర్ణాధ్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఒక కొత్త ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇక నుంచి గ్రామాల్లోని పీహెచ్‌సీల్లోనూ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక వైద్యుడితో పాటు గ్రామాల్లో 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి తీసుకురావడం ద్వారా ప్రతిపేద వాడికి కార్పొరేట్ వైద్య సేవలు వారి ముంగిటకే వస్తాయన్నారు. పీహెచ్‌సీలో ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక వైద్యుడుకి సేవలు అందించే బాధ్యతలను అప్పగించారన్నారు. ఆరెండు వేల కుటుంబాలకు ఆయన ఫ్యామిలీ డాక్టర్‌గా వ్యవహరిస్తారని వారికి ఎప్పుడు ఏవైద్యం అవసరమైనా సంబంధిత సమాచారంతో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇకపై పీహెచ్‌సీల్లో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజుల పాటు ఆరు విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం : హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'లో భాగంగా మండలంలోని కాండ్రకోటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్‌గా వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజాలతో కలసి దవులూరి ప్రారంభించారు. సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ 108, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టగా, తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ మరో ముందడుగు వేసి ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేసి గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దొరబాబు కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కులను దొరబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బషీర్, పీఏసీఎస్ అధ్యక్షులు పల్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గంటా రామస్వామి, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, వైవీకే సాయి, పీతా రాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



యండపల్లిలో సచివాలయ కన్వీనర్‌కు కిట్‌ను అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఏకమై పోటీ చేసినా వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని రమణక్కపేట, ఇసుకపల్లి, యండపల్లి, కొత్తపల్లి, కొత్తమూలపేట గ్రామాల్లో గురువారం పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీలం పెద్దఅప్పారావు, రావి రమేష్, నక్క మణికంఠాబాబు, ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, గుండ్ర రాజుబాబు, గుండ్ర జగ్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



పిఠాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిఠాపురంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, అల్లుబోయిన సూరిబాబు, ఏలేటి వెంకటేశ్వరరావు, పి.రామచంద్రరావు పాల్గొన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో బీజేపీ నేత చిట్టా మధు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్రి సత్యనారాయణ, వియ్యపు రాములు, మాదేపల్లి ఈశ్వరరావు, తొగరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో బోరు ప్రారంభం



14 వార్డులో బోరును ప్రారంభించిన దవులూరి సుబ్బారావు

సామర్లకోట: స్థానిక 14వ వార్డులో తాగునీటి ఎద్దడి నివారణకు ఏర్పాటు చేసిన బోరును గురువారం సాయంత్రం దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, డీఈ హుస్సేన్, కౌన్సిలర్లు నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

గండేపల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బొర్రపాలెం శివారులో పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేవారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2300 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పశువులను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

గండేపల్లి: పశువులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మురారి శివారులో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. పశువులు తరలిస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా వ్యాన్‌లో ఆరు ఆవులు, పది దూడలు ఉన్నాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని ద్వారకా గోశాలకు తరలించారు. నిదింతులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు గురువారం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

